

డీఎస్పీగా పరిగి సీఐ శ్రీనివాస్



పరిగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పరిగి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ) ఎస్.శ్రీనివాస్ డీఎస్పీగా ప్రమోషన్ పొందారు. ఈ మేరకు ఆయన సోమవారం డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు. ఆ తర్వాత డీఎస్పీగా పోస్టింగ్ తీసుకోనున్నారు. గతంలో శ్రీనివాస్ ఇక్కడ ఎస్ఐగా పని చేశారు.

అశాస్త్రీయంగా కులగణన విధులు

అన్ని స్కూళ్ల టీచర్లకు డ్యూటీ కేటాయించాలి : టీయూటీఎఫ్

వికారాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణన ప్రక్రియకు ఉపాధ్యాయులకు విధుల కేటాయింపుల్లో ప్రభుత్వం అశాస్త్రీయంగా వ్యవహరించిందని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యనారాయణరెడ్డి, సుదర్శన్ ఆరోపించారు. వారు ఆదివారం మాట్లాడుతూ కుల గణనకు కేవలం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులనే పరిగణనలోకి తీసుకొని.. ఉన్నత, ప్రాథమికోన్నత స్కూళ్ల టీచర్లను విస్మరించడం తగదన్నారు. ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులకే విధులు అప్పగించడం వల్ల వారు తీవ్ర ఒత్తిడి లోనవుతారని, అలాగే కుల గణన సర్వే ఆలస్యమయ్యే ఆస్కారం ఉందన్నారు.

దివ్యాంగులను మినహాయించాలి

అలాగే దివ్యాంగ టీచర్లు, గర్భిణులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని విధుల నుంచి మినహాయించాలని కోరారు. ఉదయం పాఠశాల విధులు నిర్వహించి, మధ్యాహ్నం సర్వే చేయాలని ప్రభుత్వం పేర్కొనడంతో ఈ ప్రక్రియ మందకొడిగా సాగే ఆస్కారం ఉందన్నారు. ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ స్కూళ్ల టీచర్లకు సమగ్ర కుటుంబ(కుల గణన) విధులు కేటాయించాలని టీయూటీఎఫ్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డీ హబ్‌కు జబ్బు!

తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్‌లో పనిచేయని యంత్రాలు

15రోజులుగా నిలిచిన రోగ నిర్ధారణ పరీక్షలు
పేదలకు తప్పని ఆర్థిక భారం
ప్రైవేట్ కేంద్రాలను ఆశ్రయిస్తున్న రోగులు
పట్టించుకోని అధికారులు





చేవెళ్లలోని కమ్యూనిటీ ఆసుపత్రి

ఏదైనా సుస్తీ చేస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడం పేదలకు భారంగా మారింది. ప్రైవేట్‌లో వాటికయ్యే వేల రూపాయల డబ్బులు భరించలేని పరిస్థితి వారిది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉండవు. ఈ నేపథ్యంలో జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా తెలంగాణ డయాగ్నస్టిక్స్ హబ్ సేవలను(డీ హబ్) ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. కొన్నిరోజులుగా ఈ హబ్‌కు జబ్బు చేసింది. యంత్రాలు పనిచేయక రోగ నిర్ధారణ పరీక్షలు నిలిచిపోయి రోగులు అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రైవేట్‌కు పరుగులు తీస్తున్నారు.

రంగారెడ్డి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ డయాగ్నస్టిక్స్ హబ్ సేవలు(డీ హబ్) 2018 జనవరిలో ప్రారంభమయ్యాయి. తొలుత హైదరాబాద్‌కే పరిమితమైన ఈ సేవలను ఆ తర్వాత అన్ని జిల్లాలకు విస్తరించారు. ఉమ్మడి జిల్లాలోని నిరుపేదలకు వైద్య పరీక్షల భారాన్ని



వికారాబాద్‌లోని రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రంలో పాడైన మిషన్లు

తగ్గించేందుకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో దీనిని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం పరిధిలోకి ఆలూరు, బంట్వారం, బషీరాబాద్, బొంరాస్‌పేట్, చందనవెల్లి, చన్‌గొముల్, చేవెళ్ల, చిట్యాల్, ధారూరు, దోమ పీహెచ్‌సీలతో పాటు కొడంగల్ సీహెచ్‌సీ, కొడంగల్ పీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే కొందుర్గు, కోట్‌పల్లి, కుల్కచర్ల, మర్పల్లి, మొయినాబాద్, మోమిన్‌పేట్, నాగసముద్ర, నవల్గా పీహెచ్‌సీలు, పరిగిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు పెద్దేముల్ పీహెచ్‌సీ, పూడూరు, రామయ్యగూడ, షాబాద్, శంకర్‌పల్లి, సిద్దులూరు పీహెచ్‌సీలు ఉన్నాయి. తాండూరు డీహెచ్‌తో పాటు యూపీహెచ్‌సీ, తాండూరు ఎంసీహెచ్, తాండూరు పీహెచ్‌సీ, వికారాబాద్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అలాగే

మిగతా 7వ పేజీలో...



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

వంతెన నిర్మాణం వెంటనే పూర్తిచేయాలి

15 ఏళ్లుగా సాగుతున్న పనులు
ఘట్‌కేసర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన

ఘట్‌కేసర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఏళ్లుగా పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఘట్‌కేసర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఘట్‌కేసర్ రైల్వేవంతెన నిర్మాణ పనులు 15 సంవత్సరాల నుంచి కొనసాగడంపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పనులు పూర్తి కాక పోవడంతో నిత్యం వేలాది మంది ప్రజలు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి.. ఎమ్మెల్యేలు మారుతున్నారు.. తప్ప వంతెన పనులు మాత్రం పూర్తికావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కొన్ని నెలల పాట పిల్లర్ల కోసం గుంతలు తీసి వదిలేయడంతో అందులో పడి ఓ యువకుడు మృతి చెందినట్లు గుర్తు చేశారు. దీంతోపాటు వంతెన నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు సైతం పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిర్మాణ రంగం కుదేలు

భారీగా తగ్గిన సిమెంట్, స్టీల్ ధరలు
ఆఫర్లు ప్రకటించినా పెరగని అమ్మకాలు
ఐదేళ్ల తర్వాత మరోసారి సంక్షోభం
మార్కెట్‌లోకి కొత్తగా 25కిలోల సిమెంట్ బ్యాగ్‌లు

7

రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలడం, కాంట్రాక్టర్లకు బిల్లులు రాక అభివృద్ధి పనులు నిలిచిపోవడం, హైడ్రా ప్రభావంతో భవనాలు, డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ తగ్గిపోయాయి. దీంతో ఒక్కసారిగా సిమెంట్, స్టీల్ అమ్మకాలు క్షీణించడంతో ధరలు తగ్గాయి. అమ్మకాలకు ఆఫర్లు పెట్టినా సిమెంట్ సేల్స్ పెరగడం లేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-తాండూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి)



కీసరగుట్టపై భక్తుల కోలాహలం

నేడు దీపోత్సవం, హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ

కీసర, నవంబరు, 3(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం, ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యల్లో విచ్చేశారు. కార్తీక మాసోత్సవంలో భాగంగా రెండోరోజు గర్భాలయంలోని మూలవిరాట్‌కు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కాగా, నేడు కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని స్వామి వారికి నానావిధ ఫల రసాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సాయంత్రం ఆరు గంటలకు దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, ఆలయ చైర్మన్ నాగలింగం శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురభి నాట్యమండలి వారిచే మాయాబజార్ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన అక్కడకు వచ్చిన భక్తులను అలరించింది.



స్వామివారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

లక్ష్మీనరసింహస్వామి సేవలో నవీన్ మిట్టల్

కార్తీక మాసం సందర్భంగా చీర్యాల్ లక్ష్మీనరసింహస్వామిని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి గౌడ్, అర్చకులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ మహామండపంలో దంపతులిద్దరికీ స్వామివారి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



సదర్ ఉత్సవంలో దున్నల విన్యాసాలు

ఘనంగా సదర్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపల్, కొర్రెములలో నిర్వహించిన సదర్ కార్యక్రమం ఆకట్టుకుంది. సింగిల్ విండో డైరెక్టర్ గోపు బాల్‌రాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఉత్సవాన్ని నిర్వహించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యాదవులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. అనంతరం అలంకరించిన దున్నలను చౌరస్తాలో ప్రదర్శించారు. వేడుకలో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కృష్ణయాదవ్, అంజయ్యయాదవ్, ఐలయ్యయాదవ్, రాము, కిషోర్‌యాదవ్, పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ శారద అన్నారు. ఘనాపూర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. వ్యసనాలతో ఆరోగ్యం, భవిష్యత్తు రెండూ నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ



మాట్లాడుతున్న జిల్లా వెల్ఫేర్ అధికారి శారద

శాఖ అధికారి ఈశయ్య, వెల్నెస్ సైకాలజిస్ట్ ప్రతిమ, కేపీఐఆర్‌టీ డైరెక్టర్ దేవనాథ్, ఎస్ఐ శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘురాం రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న కుక్కలు

రోడ్లపై గుంపులుగా సంచారం



ఒంటరిగా వెళ్లేవారిపై తరచూ దాడులు
భయాందోళనలో చిన్నారులు, వృద్ధులు



7

పానాదంతా బురదే!

ఎక్మాయిలో పొలాలకు వెళ్లేందుకు రైతుల ఇక్కట్లు
ఉపాధి హామీలో రోడ్డు వేయించాలని వేడుకోలు

7



సమగ్ర సర్వేకు సిద్ధం!

సర్వేకు 77,181 ఇళ్ల గుర్తింపు

'తాండూరు'లో 623 ఎన్యూమరేటర్ల నియామకం
6 నుంచి సర్వేకు పాఠశాలల ఉపాధ్యాయులు

8



కొనుగోళ్లు షురూ

ప్రారంభమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కొనుగోలు కేంద్రాలు	
ఐకేపీ-34	
పీఏసీఎస్-61	దొడ్డురకాలకు 108
డీసీఎంఎస్-31	
మొత్తం-126	సన్నాలకు 18

మొత్తం 126 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
దొడ్డు, సన్నరకాలకు వేర్వేరుగా సెంటర్లు
గ్రేడ్ -ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,320
సన్నాలకు అందనున్న రూ.500 బోనస్
వారంలో ఊపందుకోనున్న వరికోతలు



కులకచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 126 కొనుగోలు కేంద్రాల ద్వారా 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. ఇందులో భాగాంగా పరిగి, చౌడాపూర్, దోమ మండలాల పరిధిలో అయిదు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. అలాగే నేడు యాలాల, తాండూరు మండలాల పరిధిలో ధాన్యం కొనుగోలు

మిగతా 8వ పేజీలో...

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

తూముకు మరమ్మతులు

మర్పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మండలంలోని కల్కోడ చంద్రన్నసాగర్ తూముకు ఇరిగేషన్ అధికారులు ఆదివారం మరమ్మతు చర్యలు చేపట్టారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'చెరువుకు గండి.. పంట పొలాల్లోకి నీరు' అనే కథనానికి అధికారులు స్పందించారు. తూము నుంచి నీరు వృథాగా వెళ్లకుండా ఇసుక సంచులతో పూడ్చి వేశారు. తూముకు గండి కొట్టిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులు పోలీసులకు పిర్యాదు చేశారు.

హాస్టల్‌కు వెళ్లలేక విద్యార్థి ఆత్మహత్య



అవినాశ్(ఫైల్)

మేడ్చల్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు వెళ్లేందుకు ఇష్టం లేక ఓ ఇంటర్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణం కేఎల్‌ఆర్ వెంచర్‌లో నివాసం ఉంటున్న కోట్ల వెంకటమహేశ్వరిరావు కొడుకు అవినాశ్(16) కొంపల్లి సమీపంలోని హాస్టల్‌లో ఉంటూ సమీపంలోని యాంథోని జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు దీపావళి సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చాడు. పండగ తర్వాత హాస్టల్‌కు వెళ్లాలని కోరగా అందుకు అవినాశ్ నిరాకరించాడు. తాను హాస్టల్‌లో ఉండనని కుటుంబ సభ్యులకు చెప్పగా.. వారు సముదాయించి హాస్టల్‌కు పంపే ప్రయత్నం చేశారు. దీంతో హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక శనివారం రాత్రి ఇంట్లో అందరూ పడుకున్న వేళ అవినాశ్ తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఘనంగా గ్యార్వీ వేడుకలు


గ్యార్వీ వేడుకల్లో సయ్యద్ ఖలీల్, నాయకులు

ఆమనగల్లు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో గ్యార్వీ షరీఫ్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మౌలాలి పహాడ్ దర్గా సమీపంలోని గౌసేపాక్ చిల్లా వద్ద నిర్వహించిన వేడుకల్లో ముస్లింలు, మతపెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమానికి మత గురువు హజ్రత్ సయ్యద్ జహీరుద్దీన్‌షా ఖాద్రీ హాజరయ్యారు. ముస్లింలు గ్యార్వీ షరీఫ్ జెండాతో వీధుల్లో తిరుగుతూ నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. నాయకుడు ఖలీల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మదర్సా దారుల్ ఉలుం అన్వరే ముస్తఫా ప్రిన్సిపాల్ మౌలానా అబ్దుల్ కరీం, మజీద్ అధ్యక్షుడు గౌస్ మొయినుద్దీన్, సిరాజ్, హబీబ్, ఆఫ్రీది, ఫరీన్, ఇర్ఫాన్, మహబూబ్, అహ్మద్, అక్బర్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కుమార్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పానాదంతా బురదే!

- ఎక్మాయిలో పొలాలకు వెళ్లేందుకు రైతుల ఇక్కట్లు
- ఉపాధి హామీలో రోడ్డేయించాలని వేడుకోలు


బురదమయంగా ఉన్న పానాది

బషీరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎక్మాయి శివారులో రైతులు పొలాలకు వెళ్లే పానాది మొత్తం నీరుచేరి బురదగా మారడంతో అన్నదాతలు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పానాదిలో వానాకాలం అంతా, ఇతర కాలాల్లోనూ నిత్యం నీరు నిలిచి నడిచేందుకు సైతం వీలు లేకుండా ఉంది. పొలాలకు వెళ్లేందుకు, పంట ఉత్పత్తులను ఇళ్లకు చేర్చేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఈ పానాది ఇరువైపులా ఉన్న రైతులు పానాది జాగాను కబ్జా చేయడంతో దాని వెడల్పు తగ్గి కుచించుకుపోయింది. ఎడ్లబండ్లు కూడా పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఈ పానాది నుంచే 50 మంది వరకు రైతుల పొలాలున్నాయి. వాటిల్లో పనిచేసేందుకు కూలీలు సైతం వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇటువైపు ఉన్న పొలాల్లోకి పనికి పిలిచినా కూలీలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలోనైనా పానాదిలో 12ఫీట్ల వెడల్పుతో మట్టిరోడ్డు వేయించాలని రైతులు కోరుతున్నారు.

మూడో రోజూ కొనసాగిన రిలే నిరాహార దీక్ష


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండలంగా ప్రకటించాలని గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. దీక్షకు మద్దతుగా గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజా సంఘాల నేతలు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం దీక్షలో జేఏసీ చైర్మన్ ముకురాల అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ ఏదుల శరత్‌చంద్ర, నాయకులు ఆంజనేయులు, మసున వెంకటయ్య, రమేశ్, నాగయ్యగౌడ్, నర్సింహాగౌడ్, చంద్రయ్య, జంగయ్య, ఈదమయ్య, వెంకటయ్య, జంగయ్య, రామకృష్ణ, జంగిలి, కృష్ణాజీ, బాలయ్య, లక్ష్మణ్‌నాయక్, శివాజీ, గోవింద్, పరశురామ్ తదితరులు కూర్చున్నారు.

ప్లాస్టిక్ కవర్ల వాడకం హానికరం


ప్రొద్దటూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల వాడకం పర్యావరణానికి హానికరమని జెండర్ టాస్ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం శంకర్‌పల్లి మండల పరిధిలోని ప్రొద్దటూర్ గ్రామంలో ఎంవీ ఫౌండేషన్ సభ్యురాలు నాగమణి, ఎమ్మెస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్ జెండర్ టాస్ కమిటీ సభ్యులు నాని తదితరులు ప్లాస్టిక్ వాడకం వల్ల దుష్ఫలితాల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లకు బదులు గోనే సంచులు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ఏనుగు లక్ష్మి, నాయకులు మల్లేశం, భాగ్యమ్మ, సతీష్, శిరీష, మానస, నందిని, రేఖ, చందన, కార్తీక్, రాధ, మధుప్రియ, జశ్వంత్, పవన్, సిద్దు, రోహిత్, సంజన ఉన్నారు.

కోర్టు ఉత్తమ కానిస్టేబుల్‌గా అవినాష్‌కుమార్


అవార్డు అందుకుంటున్న కానిస్టేబుల్

తలకొండపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన అవినాష్‌కుమార్ 2024సంవత్సరానికి గాను కోర్టు ఉత్తమ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్‌మహంతి చేతుల మీదుగా కానిస్టేబుల్ ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్నారు. 2011బ్యాచ్‌కు చెందిన అవినాష్ మూడేళ్లుగా తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు హత్య కేసుల్లో వరకట్న హత్య కేసులో నిందితులకు జీవితకాల శిక్ష పడేలా కృషి చేసిన అవినాష్‌కుమార్ సేవలను గుర్తించి కమిషనర్ అవార్డు అందజేశారు. అదేవిధంగా సైబరాబాద్ కమిషనరేట్‌లో పలు కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చేయడంలో ఈ ఏడాది తలకొండపల్లి పోలీస్ స్టేసన్ ప్రథమ స్థానంలో నిలిచిందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్‌కుమార్‌ను ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది అభినందించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏడీఈ అశోక్

శామీర్‌పేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు శామీర్‌పేట ఏడీఈ అశోక్ అన్నారు. మండలంలోని ఏఈడీ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ అశోక్‌రావు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు, సమస్యల సత్వర పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. బాబాగూడలో మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఏఈ రాఘవేందర్‌రావు, అలియాబాద్ ఏఈ వెంకటనారాయణ, సబ్‌డివిజన్ అధికారులు శ్రీధర్, దినకర్ పాల్గొన్నారు.

నిర్మాణ రంగం కుదేలు

భారీగా తగ్గిన సిమెంట్, స్టీల్ ధరలు ● అమ్మకాలపై కంపెనీల ఆఫర్లు
మార్కెట్‌లోకి కొత్తగా 25కిలోల సిమెంట్ బ్యాగ్‌లు

తాండూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలడం, కాంట్రాక్టర్లకు బిల్లులు రాక అభివృద్ధి పనులు నిలిచిపోవడం, హైడ్రా ప్రభావం, భవన, డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు తగ్గిపోయి సిమెంట్, స్టీల్ అమ్మకాలు క్షీణించి ధరలు తగ్గాయి. సాధారణంగా అమ్మే 50కిలోల సిమెంట్ బ్యాగ్‌లు, అలాగే కంపెనీలు కొత్తగా 25కిలోల బ్యాగ్‌లను సైతం ప్యాక్‌చేసి అమ్ముతూ ఆఫర్లు పెడుతున్నాయి. స్టీల్ ధరా తగ్గింది. భవన నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశాలకు డీలర్లు వెళ్లి తమ కంపెనీ సిమెంట్‌ను కొనాలని, ఉద్దెర కూడా ఇస్తామంటూ నిర్మాణదారులను బతిమాలుతున్నారు. చిన్న డీలర్లు సిమెంట్ షాపులనే మూసే పరిస్థితి ఏర్పడింది. అల్ట్రాటెక్ సిమెంట్ మొన్నటి వరకూ 50కిలోల బ్యాగ్ రూ.360 ఉండగా ప్రస్తుతం దాని ధర రూ.320కి తగ్గింది. ప్రభుత్వ రంగ సీసీఐ సిమెంట్ ధర రూ.310 నుంచి రూ.280 తగ్గింది. భారతీ సిమెంట్ రూ.320 ఉండగా రూ.280కి అమ్ముతున్నారు. రామ్‌కో రేటు రూ.360 నుంచి రూ.320 పడిపోయింది. అంబూజా సిమెంట్ రూ.320 ఉండగా రూ.280కి విక్రయిస్తున్నారు. కొన్ని కంపెనీలు 25కిలోల బ్యాగ్‌ను రూ.150కి చొప్పున అమ్ముతున్నాయి. ఇక స్టీల్ టన్ను ధర కొన్ని రోజుల క్రితం వరకు రూ.65వేలు ఉండగా ఇప్పుడు రూ.53వేలకు పడిపోయింది. సీసీ రోడ్ల బిల్లులు రాక కాంట్రాక్టర్లు కొత్త పనులు చేయడం లేదు. దీంతో సిమెంట్, స్టీలు అమ్మకాలు భారీగా పడిపోయాయి.

సిమెంట్ అమ్మకాలకు ఆఫర్లు

సిమెంట్ అమ్మకాలకు వివిధ కంపెనీలు ఆఫర్లు పెట్టాయి. 100 బస్తాలు కొన్నవారికి రామ్‌కో కంపెనీ ఒక ప్లాస్టిక్ చైర్ ఇస్తానంటోంది. భారతీ సిమెంట్ కంపెనీ కొనుగోలుదారులకు లక్కీ లాటరీ నిర్వహిస్తోంది. సీసీఐ 2,500 బస్తాలు కొన్నవారికి ఒక్కో బస్తాపై రూ.5 తగ్గింపునిస్తోంది. అలాగే అల్ట్రాటెక్ కంపెనీ తమ ఉత్పత్తిపై మేస్త్రీలకు అవగాహనకల్పిస్తూ గిఫ్ట్‌లు అందజేస్తోంది.

ఐదేళ్ల తర్వాత మరోసారి సంక్షోభం



మార్కెట్‌లో భవన నిర్మాణాలు బాగా తగ్గిపోయాయి. ఐదేళ్ల క్రితం ఇలాంటి సంక్షోభమే తలెత్తింది. చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు రాక కొత్త పనులు చేయడం లేదు. దీంతో కంపెనీలు సిమెంట్ ధరలను భారీగా తగ్గించాయి. అమ్మకాలకు ఆఫర్లు పెట్టినా సిమెంట్ సేల్స్ పెరగడం లేదు.

- రవికుమార్, సిమెంట్ డీలర్, తాండూరు



కొత్తగా 25కిలోల సిమెంట్ బస్తా

సాధారణంగా ఇప్పటి వరకు సిమెంట్ బ్యాగులను 50కిలోల పరిమాణంలో ఉండే బస్తాలే అమ్మేవారు. ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు కంపెనీలు 25కిలోల బ్యాగ్‌ను సైతం మార్కెట్‌లోకి విడుదల చేశాయి. తక్కువ మొత్తంలో సిమెంట్ అవసరం ఉన్న వారికి అనుకూలంగా ప్యాకింగ్ చేస్తున్నాయి. కాగా వీటి అమ్మకాలపైనా కంపెనీలు ఆఫర్లు ప్రకటించాయి.



దడ పుట్టిస్తున్న కుక్కలు

- రోడ్లపై గుంపులుగా సంచారం
- ఒంటరిగా వెళ్లేవారిపై తరచూ దాడులు
- భయకంపితుల్ని చేస్తున్న వైనం

బొంరాస్‌పేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి కుక్కల సంచారం ప్రజలకు ఇబ్బందిగా మారింది. బొంరాస్‌పేట్ మండల కేంద్రంతో పాటు మండల పరిధి గ్రామాల్లో కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. రాత్రి, పగలూ తేడా లేకుండా చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడిచేస్తున్నాయి. ఒంటరిగా చిన్నారులు కన్పిస్తే చాలు.. కుక్కలు వారి వెంటపడి కరుస్తున్నాయి. వృద్ధులను సైతం చుట్టుముట్టి భయకంపితులను చేస్తున్నాయి. కొట్టాల్లో కట్టేసిన పశువులకు, మందల్లో ఉన్న గొర్లు, మేకలకు కూడా కుక్కలతో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే చాలా సార్లు మేకలు, గొర్లను కుక్కలకు కరిచి చంపాయి కూడా! వీధి కుక్కల స్వైర విహారంతో రాత్రిపూట బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. రోడ్లపై ఉంటున్న కుక్కల గుంపులతో జనం బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీల అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

కార్మికులకు కనీస వేతనాలివ్వాలి


కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

దౌల్తాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీల కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలివ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆదివారం పంచాయతీ కార్మికులతో నిరసన వ్యక్తం చేశారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలనెలా వేతనాలిచ్చి పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం నెలకొల్పేందుకు పంచాయతీ కార్మికులు రోజూ ఎంతో శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్మికులు సాయిలు, రాములు, సుమిత్ర, నారాయణ, దస్తప్ప, ఆశాలత, వీరప్ప, అనంతయ్య, నాగమ్మ పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

సీఎం నిర్ణయం హర్షణీయం

పరిగి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గురుకులాల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్‌రెడ్డి మెస్, కాస్మొటిక్స్ చార్జీలు పెంచడం హర్షణీయమని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రాంతీయ సమన్వయకర్త కె.సుధాకర్ అన్నారు. పరిగి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శరత్‌కుమార్, గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మిలకు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరునక్షత్ర మహోత్సవాలు


చినజీయర్‌స్వామితో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో తిరునక్షత్ర మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మూడో రోజు ఆదివారం చినజీయర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు, ఇష్టాగోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, మంగళాశాసనాలు అందజేశారు. హిందూస్థానీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పాల్గొన్నారు. ఆయన చినజీయర్‌స్వామి ఆశీస్సులు పొందారు. ఈ నెల 5న ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి, మై హోమ్ గ్రూప్ అధినేత రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రాజకీయాలు అశాశ్వతం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

పరిగి రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు అశాశ్వతమని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. పరిగిలో ఆదివారం హిందూ ధార్మిక సమితి ఆధ్వర్యంలో కార్తీక మాస దీపోత్సవ సత్సంగం నిర్వహించారు. జాతీయ సాహిత్య పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక వక్త డాక్టర్ భాస్కర్ యోగి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై శివ పూజలో దీపారాధన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ జీవన విధానంలోని మూలాలు చాలా గొప్పవన్నారు. కుల వ్యవస్థ పట్ల వ్యత్యాసాలను వీడి మనమంతా ఐకమత్యంతో మెలగాలని సూచించారు. అనంతరం కార్తీక వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొకట్ మాధవరెడ్డి, సిద్ధాంతి పార్థసారథి, కరణం ప్రహ్లాద్‌రావు, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, శివరాజు, కేపీ రాజు, వడ్ల నందు, వెంకటయ్యగౌడ్, పెంటయ్యగుప్తా, రాముయాదవ్, బాలక్రిష్టారెడ్డి, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కార్తీక మాస విశిష్టతపై విద్యార్థులకు బోధన


విద్యార్థులకు సందేశమిస్తున్న రమేష్

తాండూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నెల రోజుల కార్తీక మాస విశిష్టతపై బాలగోకులం వికారాబాద్ జిల్లా కార్యవాహక్ రమేష్ విద్యార్థులకు వివరించారు. తాండూరులోని భవానీనగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన బాలగోకులం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థులు చదువుతో పాటు పండుగల విశిష్టతలను కూడా తెలుసుకోవాలన్నారు. ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సంఘాల, సంస్థల నాయకులు

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భారత రత్న అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.రహమాన్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఎదులాబాద్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఉన్నత చదువుతోనే మనుషులు ప్రగతి సాధిస్తారని, ప్రతీ ఒక్కరు తప్పక చదువుకోవాలన్నారు. అలాగే ఓటు హక్కును వినియోగించుకొని ఉత్తమ ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, దాసు, నర్సింగరావు, రాందాస్, నారాయణ, శ్రీనివాస్, సత్యం, రాజేష్, వెంకటేశ్వర్‌రావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థినికి సన్మానం


భవిష్యరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు

తాండూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణానికి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైంది. పట్టణంలోని మల్‌రెడ్డిపల్లికి చెందిన అటవీ శాఖలో ఇందూర్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మమత, కరుణాకర్‌రెడ్డిల కుమార్తె భవిష్యరెడ్డి రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని లెజెండ్ అకాడమిలో భవిష్యరెడ్డి, కోచ్ బృందాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రతినిధులు బాలకృష్ణారెడ్డి, పి.రాంరెడ్డి, పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీ హబ్‌కు జబ్బు!

(5వ పేజీ తరువాయి)

యూపీహెచ్‌సీ ఉన్నాయి. యాలాల పీహెచ్‌సీ, తాండూరు, వికారాబాద్, కొడంగల్‌లోని బస్తీదవఖానాలు ఈ హబ్ పరిధిలో ఉన్నాయి. రెండు జిల్లాల్లో 40 ప్రభుత్వ ఆసుపత్రులను ఈ ల్యాబ్‌కు అనుసంధానం చేశారు.

57 రకాల పరీక్షలు..

ఈ సెంటర్‌లో ఒకేసారి రక్త, మూత్ర, అవయవ పనితీరు, థైరాయిడ్, లివర్, కిడ్నీ పనితీరు, కొలెస్ట్రాల్, చికున్‌గున్యా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, క్యాల్షియం, సిరమ్ క్రియటినైన్, డీహెచ్‌డీఎల్, ఎలక్ట్రరేట్స్, హెచ్‌బీఎస్‌హెచ్‌జీ వంటి 57 రకాల పరీక్షలు చేస్తారు. వీటితో పాటు ఖర్చుతో కూడుకున్న టీ స్కాన్, 2డీ ఈకో, అల్ట్రా సౌండ్, మ్యామోగ్రఫీ లాంటి స్కానింగ్ పరీక్షలు కూడా నిర్వహిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి నమూనాలను జిల్లా కేంద్రాలోకి డయాగ్నస్టిక్ సెంటర్‌కు చేరవేసేందుకు ప్రత్యేక వాహన వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లాలో దూరాన్ని బట్టి ఒకటి, రెండు లేదా మూడు రూట్లుగా విభజించారు. ప్రతీ రోజు జిల్లా కేంద్రం నుంచి బయల్దేరి పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నుంచి నమూనాలను ఐస్ బాక్స్‌లో పెట్టుకొని తిరిగి మధ్యాహ్నం వరకు ల్యాబ్‌కు చేరుకుంటారు. ఆన్‌లైన్‌లో రోగి పేరు, బార్‌కోడ్, వివరాలు నమోదు చేస్తారు. ఆ నమూనాలను జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రానికి చేరుస్తారు. అన్ని ఆసుపత్రుల నుంచి తీసుకు వచ్చిన నమూనాలను పరీక్ష చేసి నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతారు. ఫలితాలను ఆయా పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రింట్ తీసి రోగికి అందజేస్తారు.

ప్రయోజనం శూన్యం

రెండేళ్ల క్రితం ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. 15 రోజుల నుంచి ఆన్‌లైన్‌లో నివేదికలు రావడం లేదు. రక్త నమూనాలు ఇచ్చిన రోగులంతా రోజు టెస్ట్ రిపోర్ట్స్ కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ఇక లాభం లేదని కొందరు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. డబ్బు లేని నిరుపేదలకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ లేక ముందు స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే కొన్ని రకాల పరీక్షలు జరిగేవంటున్నారు.

15రోజులుగా నిలిచిన సేవలు

వికారాబాద్‌లోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌లో యంత్రాలు పాడవడంతో 15 రోజుల నుంచి టెస్టులు నిలిచిపోయాయి. అక్టోబరు 15 నుంచి 19 వరకు తీసుకున్న రక్త నమూనాలకు సంబంధించి రిపోర్టులు ఇప్పటి వరకు రాలేదు. యంత్రాలు పనిచేయకపోవడంతో రక్తనమూనాలు తీసుకోవద్దని 40 ప్రభుత్వ ఆస్పత్రుల ల్యాబ్ టెక్నీషియన్లకు మెసేజ్‌లు పెడుతున్నారు. ఒక్కో పీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల నుంచి రోజుకు 20-30 నమూనాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి రోజుకు 40-55 రక్తనమూనాలు వెళ్లేవి. డయాగ్నస్టిక్ సెంటర్‌లో యంత్రాలు పాడవడంతో వందలాది మంది రోగులు రక్త పరీక్షలకు ప్రైవేట్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. చేవెళ్ల, వికారాబాద్, పరిగిలో డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. మూడు షిఫ్టుల్లో రోజుకు 15 మంది ఒక్కో సెంటర్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. కానీ.. డయాలసిస్ చేయాలంటే.. ముందుగా సీబీపీ, ఆర్ఎఫ్‌టీ, ఎల్ఎఫ్‌టీ రక్తపరీక్షలు తప్పనిసరి. వీటికి ప్రైవేట్ డయోగ్నొస్టిక్ కేంద్రాల్లో రూ.1,500 వరకు అవుతుంది. ప్రస్తుతం తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌లో థైరాయిడ్ టెస్టు మినహా ఏ టెస్టు చేయడం లేదు. 15 రోజుల నుంచి రక్త నమూనాలు ఎందుకు తీసుకోవడం లేదనే విషయాన్ని వికారాబాద్‌లోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ మేనేజర్ శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. యంత్రాలు రిపేర్ చేయించాని, త్వరలోనే టెస్టులు చేస్తామని చెప్పారు.


చేవెళ్లలోని డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు

ప్రైవేట్‌లోనే రక్త పరీక్షలు చేయిస్తున్న



నా భార్య శకుంతల డయాలసిస్ పేషెంట్. బయట మెడికల్ కాలేజీలో డయాలసిస్ చేయిస్తే రూ.2500 అవుతుంది. చేవెళ్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇక్కడే చేయిస్తున్న. సీబీపీ, ఆర్ఎఫ్‌టీ, ఎల్ఎఫ్‌టీ పరీక్షలు చేయిస్తేనే డయాలసిస్ చేస్తామని సెంటర్ నిర్వాహకులు చెబుతున్నారు. ఈ టెస్టులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేయడం లేదు. బయట చేయిస్తే రూ.1,500 ఖర్చు అవుతుంది.

- బల్వంతరెడ్డి, కందాడ, చేవెళ్ల మండలం

ఆర్థిక భారం పడుతోంది



మా నాన్న శంకరయ్య డయాలసిస్ పేషెంట్. ఏడాది నుంచి చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ చేయిస్తున్న ఈ కేంద్రంలో గత నెలలో నిడిల్ కొరత ఉండేది. ఇప్పుడు యంత్రాలు పాడవడంతో 15 రోజుల నుంచి సీబీపీ, ఆర్ఎఫ్‌టీ, ఎల్ఎఫ్‌టీ టెస్టులు చేయడం లేదు. ప్రైవేట్‌లో డబ్బులు చెల్లించి టెస్టులు చేయిస్తున్నాం. ఆర్థిక భారం పెరిగిపోతుంది.

- నరేష్, షాబాద్ మండలం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పరిగి/పరిగి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నెం.02లో 2002-03లో టెన్త్‌ను చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరారు. 22ఏళ్ల తర్వాత రంగాపూర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో సమ్మేళనాన్ని నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన సుధాకర్‌రెడ్డి



మహేశ్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధాకర్ రెడ్డి

వికారాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థ సుధాకర్‌రెడ్డి ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై సుదీర్ఘ చర్చలు జరిపారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్ ఉన్నారు.

నవాబుపేట: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను నవాబుపేట మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రావుగారి వెంకట్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

శబరిమలకు అయ్యప్ప స్వాముల పాదయాత్ర

తాండూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారులు తాండూరు నుంచి మహా పాదయాత్రగా శబరిమలకు ఆదివారం బయల్దేరారు. తాండూరు పట్టణం కొడంగల్ రోడ్డులోనున్న అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వాములు, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో 1400 కిలోమీటర్లు 37రోజుల పాటు పాదయాత్రను చేపట్టేలా ప్రణాళికను రూపొందించారు. 37వ రోజుకు శబరిమలలోని అయ్యప్పస్వామిని దర్శించుకుంటామని స్వాములు వెల్లడించారు. మార్గమధ్యలో జుంటుపల్లి వద్ద బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింహులు అయ్యప్ప స్వాములను కలిసి ఆశీర్వాదం పొందారు.

ఏకశిలనగర్ వెంచర్‌లో కేసులు లేవు



నినాదాలు చేస్తున్న కొర్రెముల ఏకశిల నగర్ ప్లాట్ ఓనర్స్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏకశిలనగర్ వెంచర్‌లో కేసులున్నాయని ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని హర్షకన్‌స్ట్రక్షన్ యాజమాన్యం అబద్ధాలు చెబుతోందని ఏకశిలనగర్ ప్లాట్ ఓనర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. కొర్రెముల ఏకశిలనగర్ వెంచర్‌లో ఆదివారం ప్లాట్‌ఓనర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొర్రెముల రెవెన్యూ పరిధిలో 1986లో ఏకశిలనగర్ వెంచర్ ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. హర్ష కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం ఏకశిలనగర్‌పై పలు కేసులు వేసినా అసోసియేషన్ గెలిచిందని గుర్తుచేశారు. ఏకశీలనగర్‌పై కేసులు ఉన్నాయని అధికారులకు అబద్ధాలు చెప్పి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా హర్ష కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం ప్రయత్నిస్తోందని తెలిపారు. వెంచర్ ఏర్పాటు చేసిన తర్వాత పట్టాదారు పాసుపుస్తకాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. వెంకటేష్ ధన, రాజకీయ బలంతో తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. న్యాయంతమవైపే ఉందని ప్రభుత్వ అనుమతితో ఇళ్ల నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకశీలనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శివారెడ్డి, శ్రీనివాసచారి, ముత్తారెడ్డి, మాటూరి రవి, ధర్మేందర్, జలరాజు, ఐలయ్య, వెంకటేష్, ఈశ్వర్, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.


గోర్‌బోలిని లంబాడాల మాతృభాషగా రాయాలి



పరిగిలో మాట్లాడుతున్న గట్యానాయక్

పరిగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనలో లంబాడాల మాతృభాషగా గోర్‌బోలి అని రాయాలని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు పి.గట్యానాయక్ కోరారు. పరిగిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6 నుంచి కులగణన చేస్తున్నదని, అందులో భాగంగా మాతృభాష దగ్గర గోర్‌బోలి అని తప్పకుండా రాయించుకోవాలని సూచించారు. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవింద్‌నాయక్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ కన్నుమూత



ఫూల్‌సింగ్

పెద్దేముల్, నవంబరు 3: అనారోగ్యంతో మాజీ సర్పంచ్ ఫూల్‌సింగ్ కన్నుమూశారు. పెద్దేముల్ మండలం పాషాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఫూల్‌సింగ్ కొంత కాలంగా అనారోగ్యంతో ఇంటికే పరిమితం కాగా ఆదివారం తుదిశ్వాస విడిచారు. గిరిజన గ్రామానికి చెందిన ఆయన రాజకీయంగా మంచి పేరును సంపాదించుకున్నారు. అనారోగ్యంతో ఆయన మృతిచెందడంతో విషయం తెలుసుకున్న రాజకీయ నాయకులు ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంధుమిత్రుల సమక్షంలో ఆయనకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సిద్ధం!

- తాండూరు డివిజన్‌లో 623 ఎన్యూమరేటర్ల నియామకం
- సర్వేకు 77,181 ఇళ్ల గుర్తింపు
- అంచనా జనాభా 3,08, 727లక్షలు
- సర్వేకు పాఠశాలల ఉపాధ్యాయులు

తాండూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు తాండూరు డివిజన్ సిద్ధమైంది. రాష్ట్ర సరిహద్దు కర్ణాటకను ఆనుకొని ఉన్న ఈ నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీతో పాటు నాలుగు మండలాలు ఉన్నాయి. పకడ్బందీగా సర్వేను నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశానుసారంగా మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు నియామకం ప్రక్రియను పూర్తిచేశారు. సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేగా పిలువబడే ఈ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, ఉపాధి, కుల గణనను ఇంటింటికి వెళ్లి చేపడుతారు. మొత్తం 63రకాల ప్రశ్నావళిని రూపొందించారు. ప్రధానంగా బీసీ గణనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది. తాండూరు డివిజన్ పరిధిలో గణనను ఈనెల 6వ తేదీ నుంచి చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి మొదటి దశ శిక్షణ, పూర్తికాగా రెండో దశగా ఈనెల 4న (నేడు) మిగిలిన సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.

కాంగ్రెస్ శ్రేణుల భాగస్వామ్యం

అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులైన మున్సిపల్ చైర్మన్లు, వార్డు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు భాగస్వామ్యం కావాలని జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

కొత్తగా టీచర్ల నియామకం

ఈ సర్వేకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను సర్వేకు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం పాఠశాలలో విధులు నిర్వహించి మధ్యాహ్నం ఈసర్వేను నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి శని, ఆదివారాల్లో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు పూర్తిచేశారు. ఒక్కొక్క బ్లాక్‌కు 150 ఇళ్ల చొప్పున ఎన్యూమరేటర్ బ్లాక్‌లను అధికారులు వర్గీకరించి ఎన్యూమరేటర్లను నియమించారు.



డోర్ స్టిక్కర్ అతికిస్తున్న ఎన్యూమరేటర్

డివిజన్ స్థాయిలో షెడ్యూల్ ఇలా

ఈనెల 6వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఇంటింటి సర్వే, 19 నుంచి 30వ తేదీ వరకు 11రోజుల పాటు ఆన్‌లైన్ ఎంట్రీ, 30న సమగ్ర రిపోర్టు సమర్పించుట. ఎన్యూమరేటర్లుగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఆర్పీలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు, ఈజీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లను నియమించారు.

ప్రతీ ఇంటికి స్టిక్కర్

ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేయనున్నారు. ఒక ఇంట్లో ఎన్ని కుటుంబాలుంటే అన్ని స్టిక్కర్లను ఎన్యుమరేటర్లు అతికిస్తారు. ఆ స్టిక్కరులో యజమాని పేరు, ఇంటి నెంబర్, జిల్లా, మండల లేక మున్సిపాలిటీ ఎన్యూమరేటర్ల కోడ్ నెంబర్లు, మొత్తం కుటుంబాల సంఖ్యను వివరిస్తారు. దీన్ని హౌజ్‌లిస్టింగ్ సర్వేగా పేర్కొంటారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



దోమ: వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దోమ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కులకచర్ల: రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. కులకచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాల్లో డీసీఎంఎస్, సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, కుమ్మరి స్వామి, అంజిలయ్యగౌడ్, ఆనందం, వెంకటయ్యగౌడ్, కృష్ణారెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పరిగి రూరల్: పరిగిలో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరశురాంరెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ,కె.తావుర్యనాయక్, మల్లేష్, శేషిరెడ్డి, డీసీఎమ్మెస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒకే తప్పుకు రెండు చలాన్లు

- వికారాబాద్ ట్రాఫిక్ పోలీసుల తీరు

వికారాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో ఇరుకురోడ్లు, ఆపై రోడ్లపై తోపుడుబండ్లు ఏదైనా ఎమర్జెన్సీ కోసం రోడ్లపైకి కారులో వస్తే రోడ్డు పక్కన పార్కింగ్ చేద్దామన్నా స్థలం ఉండదు. అయినా పోలీసులు నిబంధనల ప్రకారం ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే జరిమానా తప్పడంలేదు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చలాన్లు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు ఒకే తప్పుకు రెండు చలాన్లు విధించారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ మండలం అత్తెల్లికి చెందిన మహేందర్ తన మహేంద్ర ఎక్స్‌యూవీ 300 వాహనాన్ని పట్టణంలోని అపోలో మెడికల్ ప్రాంతంలో మే 3న నిలిపాడు. దీంతో ఉదయం 10.13 నిమిషాలకు పోలీసులు రాంగ్ పార్కింగ్ పేరుతో రూ.1000 జరిమానా విధించి ఫొటో అప్‌లోడ్ చేశారు. అయితే అదే ఫొటో అదే సమయంతో మరోసారి 8వ తేదీన జరిమాన విధిస్తూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాడు. కారు చలానాలు ఏమైనా ఉంటే కడదామనుకున్న మహేందర్ ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఒకే ఫొటోతో రెండు చలాన్లు వేయడంతో అవాక్కయ్యాడు. అయితే టార్గెట్ల కోసం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఇష్టానుసారంగా చలాన్లు వేస్తున్నారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.

దుకాణాల ఏర్పాటు ఎప్పుడో?

- బస్టాండ్ ఆవరణలో షెడ్ల తొలగింపు
- జీవనోపాధి కోల్పోయిన చిరువ్యాపారులు



దుకాణాలను తొలగిస్తున్న అధికారులు (ఫైల్)

మర్పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీ స్థలాల్లో దాదాపు 50మంది చిరు వ్యాపారుల రేకుల షెడ్లను ఆర్టీసీ అధికారులు ఇటీవలే తొలగించారు. ఆ స్థలాన్ని ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించి దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారులకే అప్పగిస్తామని హామీ ఇచ్చారు. అయితే నెలలు గడుస్తున్నా నేటి వరకు దుకాణాలను ఏర్పాటు చేయలేదు. దీంతో వ్యాపారం చేసుకునే అవకాశం లేక పూటగడవటం కష్టంగా మారిందని పలువురు చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్పల్లి మండల కేంద్రానికి చెందిన ఓ పాన్‌షాప్ వ్యాపారి చేసేది ఏమి లేక ఓ వాహనం (క్వాలీస్)లో పాన్‌షాప్ కొనసాగిస్తున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దుకాణాలను ఏర్పాటు చేసి తమకు అప్పగించాలని కోరారు.



వాహనంలో ఏర్పాటు చేసిన పాన్‌షాప్

ప్రమాదకరంగా ముళ్లపొదలు

- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మైల్వార్ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డులో ఇరువైపులా ముళ్లపొదలు

బషీరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైల్వార్ గ్రామానికి వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డులో ముళ్లపొదలు ఏపుగా పెరిగి రోడ్డుపైకి వచ్చాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలతో ఎదురుగా వచ్చే వాహనాలను కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూల మలుపుల వద్ద మరింతగా ముళ్లపొదాలు ఉండటంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనుగోళ్లు షురూ

(5వ పేజీ తరువాయి)

కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. వారం, పది రోజుల్లో వరి కోతలు ఊపందుకోనున్న నేపథ్యంలో అప్పటిలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ తెరిచే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 1.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇందుకు గాను 126 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఐకేపీ ఆధ్వర్యంలో 34, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 61, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31 కొనుగోలు కేంద్రాల చొప్పున ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో 108 కేంద్రాల్లో దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లు చేయనుండగా, 18 కేంద్రాల్లో సన్నరకాలు కొనుగోలు చేస్తారు. గ్రేడ్ -ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, గ్రేడ్-బీ రకం ధాన్యానికి రూ.2,300గా ధర నిర్ణయించారు. సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్‌గా చెల్లించనున్నారు.

అందుబాటులో టార్పాలిన్లు

ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాకు 26.52 లక్షల గన్నీ బస్తాలు అవసరం కాగా, ప్రస్తుతం 11.40 లక్షల బస్తాలు అందుబాటులో ఉన్నాయి. ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కావడంతో గన్నీ బస్తాల కొరత ఎదురయ్యే అవకాశం ఉంది. వానాకాలం సీజన్‌లో గత రెండేళ్లలో గన్నీ బస్తాలు అవసరమైన మేరకు అందుబాటులో లేక జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తూకం వేసేందుకు 334 తూకం యంత్రాలు, 263 తేమ శాతం గుర్తించే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. అకాల వర్షం కురిసినా ధాన్యం ధాన్యం తడవకుండా ఉండేలా కొనుగోలు కేంద్రాలకు 4,625 టార్పాలిన్లను అందుబాటులో ఉంచారు.

సన్నాలకు సపరేటు

సన్నరకం ధాన్యం సేకరించేందుకు జిల్లాలో ప్రత్యేకంగా 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరిగి, గడిసింగాపూర్, మంబాపూర్, బెల్కటూర్, అప్పాయిపల్లి, బాస్‌పల్లి, కిష్టాపూర్, ఇబ్రహీంపూర్, యాలాల్, అంత్వార్, హస్నాబాద్, చౌడాపూర్, అంతారం, ముజాహిద్‌పూర్, మైల్వార్, ఖాసీంపూర్, నాగారం, గట్టేపల్లిల్లో సన్నరకం ధాన్యం సేకరించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో సన్నరకం వరి సాగు చేసినట్లు అంచనా.

అన్ని ఏర్పాట్లు పూర్తి



ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. రైతులు ధాన్యంలో తాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తేమ లేకుండా ఆరబెట్టిన తర్వాతనే కేంద్రాలకు తీసుకురావాలి.

\- లింగ్యానాయక్, అదనపు కలెక్టర్

'సదర్'ను రాష్ట్ర పండువగా గుర్తించడం హర్షణీయం

చేవెళ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సదర్ సమ్మేళన్‌ను రాష్ట్ర పండువగా గుర్తించడం హర్షణీయమని చేవెళ్ల మండల కాంగ్రెస్ యువ నాయకుడు గణపురం తరుణ్ తెలిపారు. ఆదివారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ యాదవులంతా గ్రామాల్లో సదర్‌సమ్మేళనం ఘనంగా నిర్వహించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి యాదవులు, కురుమల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ఎమ్మెల్యేకు మొక్కను బహూకరిస్తున్న బ్రహ్మకుమారి

శంషాబాద్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : మానసిక ప్రశాంతతకు ప్రతీఒక్కరు ధ్యానం చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం బ్రహ్మకుమారి మెడిటేషన్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేడు ఉరుకులు, పరుగుల జీవితంలో మనిషి తన ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడం లేదని చెప్పారు. ఎంత సంపదన ఉన్నా ఆరోగ్యం బాగోలేకపోతే జీవితం వృథా అని చెప్పారు. అందుకోసమే ప్రతీఒక్కరు ఆరోగ్యం కోసం కొంత సమయం కేటాయించాలని కోరారు. అంతకు ముందు ఆయన శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్‌రెడ్డి, నార్సింగ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, బ్రహ్మకుమారిస్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

ఆమనగల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభు త్వం పెద్దపీట వేస్తుందని కేఎన్ఆర్ యువసేన జిల్లా నాయకులు, కాంగ్రెస్ నేత విజయ్‌రాథోడ్ అన్నారు. ఆరోగ్యశ్రీలో లేని వైద్యసేవలకు, ఖర్చులు భరించలేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా నిలుస్తుందన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన వడ్త్యావత్ పట్టికి రూ.15 వేలు, దేవియకు రూ.15 వేలు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరయ్యాయి. ఆదివారం మేడిగడ్డ తండాలో బాధిత కుటుంబాలకు విజయ్ రాథోడ్ చెక్కులు పంపిణీ చేశారు.

క్రైం కార్నర్

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ నిర్లక్ష్య కారణంగా ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్, ఈడబ్ల్యుఎస్ కాలనీకి చెందిన కుంభం రాములమ్మ ఆదివారం ఉదయం ఇంటి ముందు కుర్చొని ఉంది. అదే కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ ఖాజాగరీబ్ నవాబ్ నిర్లక్ష్యంగా ఆటో నడుపుతూ రాములమ్మ ఇంటి ముందు పార్కు చేసిన యాక్టివాను ఢీకొట్టడంతో బైక్ ఆమెపై పడింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మేడిపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాములమ్మ ఆదివారం సాయంత్రం మృతిచెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..



రెడ్యానాయక్ మృతదేహం

వికారాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చేపలవేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. ఈ వికారాబాద్ మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బొంరాస్‌పేట్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన రెడ్యానాయక్(37)తో పాటు అదే గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు వికారాబాద్ మండలం సర్పన్‌పల్లి చెరువులో ఆదివారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లారు. చేపలు పట్టేందుకు ఒకరి వెంట ఒకరు ప్రాజెక్టులోని చెరువు తూములోకి దిగారు. అయితే తూములోకి నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో రెడ్యానాయక్ నీట మునిగిపోయాడు. అతడి వెంట వచ్చిన ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. బయటకు వచ్చిన స్నేహితులు స్థానికుల సాయంతో రెడ్యానాయక్ కోసం గాలించి బయటకు తీయగా అప్పటికే రెడ్యానాయక్ మృతిచెందాడు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కొడంగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొడంగల్‌లో జరిగింది. ఎస్ఐ జీవీ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొడంగల్ పట్టణంలోని కలాల్‌వాడికి చెందిన పార్వతమ్మకు నలుగురు సంతానం. అందులో పెద్ద కుమారుడు ప్రసాద్(43) భార్య లలిత అనారోగ్యంతో 13 సంవత్సరాల కిందట మృతి చెందింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. 11 సంవత్సరాల కిందట సేడం తాలూకా అడికే గ్రామానికి చెందిన సురేఖను ప్రసాద్ రెండో వివాహం చేసుకోగా సంవత్సరం కిందట ఓ కుమారుడు జన్మించాడు. ఈ క్రమంలో కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య సురేఖ తల్లిగారి గ్రామం అడికేలో ఉంటోంది. గత నెల 31న భార్యను చూసేందుకు ప్రసాద్ అడికే గ్రామానికి వెళ్లి తిరిగి కొడంగల్‌కు వచ్చాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ప్రసాద్ శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని యువకుడు..

కేశంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సాయంత్రం కేశంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఫరూక్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్(25) భార్య మాధవితో కలిసి కేశంపేటలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శ్రీకాంత్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం భార్య మాధవి కూలీ పనులకు వెళ్ళిన తర్వాత శ్రీకాంత్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. భార్య సాయంత్రం కూలి పనులు ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా భర్త ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తించినట్లు తెలిపారు. అయితే, శ్రీకాంత్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తిపై కోతి దాడి

దోమ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోతి దాడి చేయడంతో ఓవ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. దోమ మండల కేంద్రానికి చెందిన నీలి శ్రీశైలం ఇంట్లోకి ఆదివారం ఓ కోతి ప్రవేశించడంతో బయటకు వెళ్లగొట్టేందుకు ప్రయత్నించగా రెచ్చిపోయిన కోతి దాడి చేసింది. మండల కేంద్రంలో కోతుల బెడద అధికంగా ఉండటంతో ఇళ్లు తెరిచి ఉంచితే చాలు కోతులు ఇంట్లోకి ప్రవేశించి మహిళలను భయాందోళనకు గురిచేస్తున్నాయని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులను స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

వికారాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ డివిజన్ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్, నవాబుపేట, మర్పల్లి, మోమిన్‌పేట, ధారూరు పూడూరు మండలాల వినియోగదారుల నుంచి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ సంజీవ్, ఏడీఈ సత్యనారాయణరెడ్డి, సంబంధిత మండలాల విద్యుత్ సహాయక ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం



దరఖాస్తులు స్వీకరిస్తున్న తాండూరు విద్యుత్ శాఖ ఏడీ శంకర్, ఏఈ రఘువీర్

తాండూరు: వారం రోజులు విద్యుత్ సంబంధిత సమస్యలు పరిష్కరిస్తామని తాండూరు డివిజన్ విద్యుత్ శాఖ ఏడీ శంకర్ తెలిపారు. విద్యుత్ వినియోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తాండూరు సబ్‌డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవ సభలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు డివిజన్ సంబంధించి 16 దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. తమ పరిధిలో లేని వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, అధిక బిల్లులు, లోవోల్టేజీ సమస్య, డీడీ తిరస్కరణ, రీడింగులు సమయంలో తీయకపోవడం వంటి సమస్యలు వచ్చాయని ఏడీ వివరించారు. దరఖాస్తుల వారీగా పరిశీలన చేసి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన దరఖాస్తు దారులతో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రఘువీర్‌రెడ్డి, అరవింద్, మహేష్, జేఏవో సేనాపతి పాల్గొన్నారు.